సాక్షి
నారాయణపేట
ఆదివారం । 15 । జనవరి । 2023



న్యూస్‌రీల్

వ్యాయామంతో ఆరోగ్యం



నారాయణపేట రూరల్: ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రధానంగా ఫిట్‌గా ఉండడానికి పోలీసులకు ఎంతో ముఖ్యమని ఆర్‌ఐ రాఘవరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వీక్లి పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పోలీసు ప్రతిరోజు వ్యాయామం చేయాలని, వారానికి ఒకసారి పరేడ్ నిర్వహించడంతో శారీరక దృఢత్వాన్ని పొందవచ్చాన్నరు. అదేవిధంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. నీట్ టర్న్ అవుట్ కల్గి ఉండాలని, సమయ పాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. సీఐ రవిబాబు, ఆర్‌ఐ కృష్ణయ్య, ఎస్‌ఐలు సురేష్, శ్రీనివాస్‌రావు, విజయ్‌కుమార్, సుధామాదురి పాల్గొన్నారు.

సంక్రాంతి సందళ్లు

జిల్లా వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు

- ముగ్గులతో ఆకట్టుకున్న ఆడపడుచులు
- పిండి వంటల తయారీలో మహిళలు
- నేడు మకర, రేపు కనుమ



నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్/ మక్తల్: జిల్లా కేంద్రంలో సంక్రాంతి పండుగలో భాగంగా భోగి పండుగను అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. సంక్రాంతి వేడుకల్లో భోగి రోజైన శనివారం ఉదయమే లేచి ఇంటి ముందు భోగి మంటలతో చలి కాచుకున్నారు. ఇళ్లోని పాత వస్తువులను తీసుకువచ్చి భోగి మంటల్లో వేశారు. ఆ మంటల చుట్టూ ఆటలు ఆడుతూ పాటలు పాడుచూ సంబరాలు ప్రారంభించారు. అనంతరం మహిళలు, యువతులు ఇంటి ముందు అలుకు చల్లి ముచ్చటైన ముగ్గులు వేయడంలో పోటీ పడ్డారు.

పిండి వంటల ఘుమఘుమలు

ఇక నువ్వుల రొట్టెలు, సజ్జ జొన్నరొట్టెతో పాటు వివిధ కూరగాయలు కూడిన కలకూరలతో కూడిన పిండివంటలు చేపట్టారు. ఆడపడుచులు వాకిట్లో ముగ్గులు వేస్తుండగా.. పెద్దవారు ఇంటికి మామిడి తోరణాలను అలంకరించారు. ప్రత్యేకించి పండివంటలు, నువ్వుల రొట్టెలు, అరిసెలు, సకినాలు, గారెలు, బక్ష్యాలు ప్రత్యేకమైన వంటకాలు తయారీ చేసుకొని కుటుంబ సమేతంగా ఆలయంలో ఇష్టదైనానికి దర్శించుకుని నైవేద్యం సమర్పించి, మొక్కలు చెల్లించుకున్నారు. చిన్నారులు ఆనందోత్సవాలతో గాలిపటాలు ఎగురవేశారు. దీంతో జిల్లా అంతటా పండగ వాతావాతారణం సంతరించకుంది.



మహంకాళివీధిలో రంగవల్లిక వేస్తున్న కుటుంబ సభ్యులు

వైభవంగా రథోత్సవం

- కృష్ణాలో క్షీరలింగేశ్వరస్వామి, బండగొండలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు
- తరలివచ్చిన భక్తజనం

నారాయణపేట రూరల్/కృష్ణా: వేదమంత్రోచ్ఛరణలు.. వేలాది తరలివచ్చిన భక్తజనం నడుమ వైభవంగా క్షీరలింగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. కృష్ణాలో వెలసిన క్షీరలింగేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో క్షీరాభిషేకం, మహా మంగళ హారతి , బిల్వార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధర్మకర్త ఎంకణ్ణగౌడ్ ప్రధాన ఆలయం నుంచి కలశంతో ఊరేగింపుగా రథం దగ్గరకు చేరుకొని స్వామివారికి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది భక్తుల సమక్షంలో అంగరంగవైభవంగా రథోత్సవంను నిర్వహించారు. మఠం పీఠాధిపతి బంతనల్ శ్రీ వృశభలింగేశ్వర మహాస్వామితోపాటు ఇతర పీఠాధిపతులు గురుమూర్తి మహాస్వామి, సిద్ధలింగమహాస్వామి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి,బీజేపీ నాయకుడు కొండయ్య తదితరులు హాజరయ్యారు.



బండగొండలో జల్దిబిందె ఊరేగింపు

మల్లికార్జునస్వామి జాతర

నారాయణపేట మండలం బండగొండలో శనివారం శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని చెరువు నుంచి జల్దిబిందెను భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం , అర్చన, పుష్పలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటాపోటీగా రెట్టాపట్లలో పాల్గొన్నారు. అలాగే, మండలంలోని బొమ్మన్‌పాడు గ్రామంలో శ్రీ కర్కలమ్మ వారి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మద్దూరు: మన ఊరు మన బడి, రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ఈ నెల 17న ఈ భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రోడ్డు విస్తరణ పనుల కూడా ఇదే రోజు ప్రారంభించే విధంగ చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాల కోసం నూతన భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఇక్కడి నుంచి పాఠశాలను తరలించొద్దని కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఫోన్‌లో సూచించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.20 కోట్లు 120 జీపీ భవనాల కోసం మంజూరయ్యాయని, గిరిజన శాఖ నుంచి తండాలకు రూ.24 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, మద్దూరులో రూ.5 కోట్లలో రోడ్డు విస్తరణ పనులు, తిమ్మారెడ్డిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.6కోట్ల పైచిలుకు నిధులు తీసుకొచ్చి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గురుకుల పాఠశాల కోసం మద్దూరులో ఉన్న స్థలంలో భవన నిర్మాణం చేపట్టడానికి నిధులు తీసుకువస్తానన్నారు. దీంతో పాటు మండలంలో సీసీ రోడ్ల కోసం రూ.2.5 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, ఎంఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, సర్పంచ్‌లు అరుణ, వీరారెడ్డి, మదుసుధన్‌రెడ్డి, హన్మిరెడ్డి, వీరేష్‌గౌడ్, వెంకట్ రాములుగౌడ్, శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మద్దూరులోని పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


కిల్లె శంకర్ (ఫైల్)

పాన్‌గల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం రేమద్దులకు చెందిన కిల్లె శంకర్(28) వ్యవసాయ పొలం సమీపంలో కేఎల్‌ఐ కాల్వలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునే సమయంలో తెగిపడిన ఎల్‌టీ వైరు తగిలి కాల్వలో పడిపోయాడు. కాల్వలో పడిన శంకర్‌ను ఆలస్యంగా గమనించిన చుట్టుపక్కల రైతులు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పండుగ వేళ అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుక్కాయపల్లిలో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కుమ్మరి బాల్‌రాజు, స్వాతి (20) ప్రేమించుకుని హైదరాబాద్ వెళ్లి మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. కాగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి బోయ శేఖర్ ఫిర్యాదు చేశారు. గ్రామపెద్దలు పంచాయతీ పెట్టి ఇరువురు కులాలు వేరు కావడంతో విడదీశారు. కొన్ని రోజులుగా భర్త బాల్‌రాజు, స్వాతి గ్రామంలోనే ఎవరి ఇంట్లో వారు ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం స్వాతి తమ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్వాతి తల్లిదండ్రులు బాల్‌రాజు మీదనే అనుమానంతో అతని ఇంటి దగ్గర మృతదేహాన్ని ఉంచారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

టైరు పేలి కారు బోల్తా

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కర్నూల్ పట్టణానికి చెందిన రాజేష్ మ్యారేజ్ ఈవెంట్స్ చేస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గద్వాలలో ఓ ఈవెంట్ పని ముగించుకొని తిరిగి తన కారులో కర్నూల్‌కు బయలుదేరాడు. జాతీయ రహదారిపై మునగాల శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు ఒక్కసారిగా టైరు పేలడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని హైదరాబాద్ వెళ్లే రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. ఇదే ప్రాంతంలో కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు కూరగాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడగా.. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని స్థానికులు పేర్కొన్నారు.

కొండల్లో కొలువైన ఉమామహేశ్వరుడు


ఉమామహేశ్వర క్షేత్రం

- నేటి నుంచి 22 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న ఉమామహేశ్వర క్షేత్రం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. మండలంలోని రంగాపూర్ పంచాయతీ పరిధిలో నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వరు ఉత్సవాలు ఏటా మకర సంక్రాంతి సందర్భంగా ఉత్తరాయణంలో శనివారం నుంచి 22 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు.

ఎత్తైన కొండలపై..

500 అడుగుల ఎత్తైన నల్లమల కొండలపై ఉమామహేశ్వర క్షేత్రం వెలసింది. పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీశైల క్షేత్రంకు ఉత్తర ద్వారంగా ఉమాశక్తి పీఠంగా ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెందింది. రావణాసురుని చంపిన తదుపరి శ్రీరాముడు శ్రీశైలం ప్రదక్షిణను ఉమామహేశ్వర క్షేత్రం నుంచి ప్రారంభించినట్లు స్థల పురాణం చెబుతుంది. అహోబిలం, మహానంది, శ్రీశైలం తదితర పుణ్య క్షేత్రాలు వెలసిన నల్లమల ప్రాంతంలోనే ఈ క్షేత్రం ఉంది. ఈ క్షేత్రం కొండ బాణం ఆకారంలో వంపు తిరిగి ఉండటంతో ఎంతగానో ఆకట్టుకుంటుంది. రెండు కొండలు ఒకదానిపై ఒకటి అమర్చినట్లు ఉండటం విశేషం. మొదటి కొండపై రెండోది 20 అడుగుల ఎత్తున ఉంటుంది. కింది కొండ విశాలంగా ఉండగా పైన ఉన్న కొండ కేవలం ఐదు అడుగుల వెడల్పు మాత్రమే ఉంది.


కొలువుదీరిన ఉమామహేశ్వరుడు


కొలువైన ఉమాదేవి అమ్మవారు

ఆధ్యాత్మిక కేంద్రంగా..

పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కొండ దిగువన భోగమహేశ్వరంలో హరిత గదులు, ఆహ్లాదకరమైన ఉద్యాన వనం ఏర్పాటు చేశారు. కొండ కింద కోనేరు నుంచి ప్రధాన ఆలయం వరకు 600 మెట్లు, విశ్రాంతిగది, పాపనాశం వద్ద ప్రత్యేక స్నానపు గదులు, డ్రెస్సింగ్ రూములు నిర్మించారు. ఆలయం నుంచి నాగుల వరకు ప్రాంగణాన్ని విస్తరించారు. ఆలయం పార్కింగ్ స్థలం నుంచి పాపనాశనం ప్రాంగణం వరకు బండలు, స్టీల్ రేలింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. మెట్ల మార్గం, ఆలయం ప్రాంతంలో సౌర విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కొండపైకి వెళ్లే రోడ్డు మార్గం విస్తరణ పనులతో పాటు వర్షపు నీటిని మళ్లించేందుకు డ్రెయిన్ ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ వద్ద యూ ఆకారంలో షెడ్డు నిర్మాణం చేపట్టారు.

స్వామివారి బ్రహ్మోత్సవాలు

14న సాయంత్రం 4గంటలకు అయ్యప్ప స్వామి పూజ, సాయంత్రం 6గంటలకు మకర జ్యోతి దర్శనం అనంతరం మంగళహారతి నిర్వహించినట్లు చైర్మన్ సుధాకర్, కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. 15న ఆదివారం సాయంత్రం 6:30గంటలకు అంకురార్పణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన, బలిహరణం, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. రాత్రి 8గంటలకు అచ్చంపేట భ్రమరాంబ దేవాలయం, వివిధ గ్రామాల నుంచి అలంకరణాలతో ఏర్పాటు చేసిన ప్రభలు ఉమామహేశ్వరానికి వస్తాయి. రాత్రి 2గంటలకు స్వామివారు ఉమామహేశ్వరంకొండపై నుంచి మంగళవాయిద్యాలతో పల్లకీసేవతో కిందకు వస్తారు. అచ్చంపేట నుంచి ప్రభోత్సవం బోగ మహేశ్వరం చేరుకోగానే 16న సోమవారం తెల్లవారు జామున 4గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం దిగువ బోగ మహేశ్వరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు పల్లకీ సేవ, 17న సోమవారం రాత్రి 7గంటలకు అశ్వవాహన సేవ, 18న మంగళవారం రాత్రి 7గంటలకు నందివాహనసేవ ఉంటుంది. 16 నుంచి 22 వరకు ఉత్తరాయణ పుణ్యకాల స్నానములు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం..



ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రోడ్డు మార్గంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. రోడ్డు మలుపుల వద్ద వెడల్పు చేసి వాహనాలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. దాతల సహకారంతో ఇక్కడికి భక్తులకు నిత్య అన్నదానం చేస్తున్నాం.

– సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్

ప్రభోత్సవంకు ముస్తాబు

- 15న భ్రమరాంబ ఆలయం నుంచి పార్వతీ, పరమేశ్వరుల ఊరేగింపు
- బోగమహేశ్వరంలో కల్యాణోత్సవం



అచ్చంపేటలో వెలసిన భ్రమరాంబదేవి అమ్మవారు.. ప్రభోత్సవంకు ముస్తాబైన భ్రమరాంబ ఆలయం

అచ్చంపేట: నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు పట్టణంలోని భ్రమరాంబ ఆలయం నుంచి ప్రతి ఏటా ప్రభ ఉత్సవం తరలివెళ్తుంది. ఈ నెల15న ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రభ ఉత్సవం ప్రారంభమవుతుంది. అలంకరించిన లారీలపై పార్వతీదేవిని ఊరేగింపుగా తీసుకెళ్తారు. అర్ధరాత్రి వరకు పట్టణంలోని ఊరేగించి 16న సోమవారం తెల్లవారుజామున 3గంటలకు భోగమహేశ్వరంకు తరలిస్తారు. అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, లింగాల, మన్ననూర్, బల్మూర్, పదర నుంచి భ్రమరాంబ దేవిని లారీలు, వ్యాన్లపై మంగళ తోరణాలతో, ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించి బాణాసంచా పేల్చి, మంగళ వాయిద్యాలు, వీరభద్ర సేవ పురంతులతో ఊరేగింపుగా ప్రభను మహా వైభవంగా తీసుకెళ్తారు. అంబదేవాలయం నుంచి పార్వతీదేవి, ఉమామహేశ్వరం నుంచి స్వామి వారిని కింది కొండలో వెలసిన భోగ మహేశ్వరంకు ఒకే సారి తీసుకొచ్చిన తర్వాత కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

చట్ట వ్యతిరేక చర్యలను సహించం


తండావాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ

మరికల్: సమాజంలో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే సహించేది లేదని డీఎస్పీ సత్యానారాయణ అన్నారు. మండలంలో బూడ్యాగానితండాలో శనివారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. మక్తల్, మరికల్ సీఐలతో పాటు ఐదు మంది ఎస్‌ఐలు, 30 సిబ్బందితో తనిఖీ చేపట్టగా, 25 బైక్‌లు, రెండు ఆటోలు పట్టుబడ్డాయి. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం అందజేస్తామని, ఎలాంటి ఆధారాలు లేని వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామన్నారు. బైక్‌లు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మహిళలపై ఎవరైన దురుసుగా ప్రవరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. తమ తండాలో అధికంగా డీజిల్ దొంగలు ఉండటం వల్ల తమకు చెడ్డపేరు వస్తుందని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి ఘటనలు కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

- ముగ్గురికి స్వల్ప గాయాలు


చెట్టును ఢీకొట్టిన బస్సు

ఎర్రవల్లిచౌరస్తా: ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన ఇటిక్యాల మండలంలోని కొట్టం కళాశాల సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఇటిక్యాల పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుధీర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో బెంగళూరుకు బయలుదేరింది. 44వ జాతీయ రహదారిపై ఇటిక్యాల మండలంలోని కొట్టం కాలేజీ సమీపంలోకి రాగానే శనివారం తెల్లవారుజామున డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఒక్కసారిగా రోడ్డు నుంచి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి చెట్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు అందులోని ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. బస్సులో సుమారు 20 మంది ఉండగా, మిగితా వారు ఇతర వాహనాల్లో అక్కడి నుంచి వెళ్లిపోయారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు


మంతన్‌గోడ్ క్రాస్ వద్ద డివైడర్‌కు ఢీకొన్నకారు

మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్ క్రాస్ వద్ద శనివారం సాయం ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి మాగనూరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉండొచ్చని స్థానికులు తెలిపారు. కారులో శేషగిరి, రాజేశ్వరి, బాలుడు నిత్విన్ ప్రయాణిస్తుండగా అందులో బాలుడికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కారులో బెలూన్ తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయంపై పోలీసులను వివరణ కోరగా.. ఎలాంటి వివరాలు తెలియదని చెప్పారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



నాగర్‌కర్నూల్ క్రైం: కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. కల్వకుర్తి నియోజకవర్గం అన్నారం చెందిన సమరసింహారెడ్డి కుటుంబసభ్యులతో కారులో సోమశిల వెళ్తుండగా మండలంలోని దేశిటిక్యాల సమీపంలో కొల్లాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు బోల్తా పడి రోడ్డు పక్కకు వెళ్లి ఆగిపోయింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న వారిని వెంటనే బయటకు తీశారు. ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడడంతో వారిని జిల్లా ఆస్పత్రికి ఆసుపత్రికి తరలించారు.

అచ్చంపేటలో ఫ్లెక్సీల రగడ

అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో అచ్చంపేట నియోజకవర్గంలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలకు సంబంధించిన నాయకులు ప్రజలకు చేరువ కావడానికి నానాతంటాలు పడుతున్నారు. ఆ దిశగా తమ ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తా, లింగాల రోడ్డు సమీపంలో ఓ దుకాణంపై ఉన్న ఫ్లెక్సీ హోర్డింగ్ వివాదానికి కేంద్రబిందువు అయ్యింది. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు సంబంధించిన ఫ్లెక్సీని నూతన సంవత్సరం, సంక్రాంతి, ఉమామహేశ్వర, రంగాపూర్ జాతర ఉత్సవాలకు శుభాకాంక్షలు తెలుపుతూ లింగాల రోడ్డులోని హోర్డింగ్‌కు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం ఆ ఫ్లెక్సీ స్థానంలో బీజేపీకి చెందిన ఫ్లెక్సీని అంటించడంతో వివాదానికి తావిచ్చింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఫ్లెక్సీ షాపు నిర్వాహకుడు, మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వరకు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు సంబంధించిన ఫ్లెక్సీని మరోసారి హోర్డింగ్‌పై ప్రదర్శించారు. ఓ పక్క అచ్చంపేట మున్సిపాలిటీ పాలకవర్గం ఈ నెల 26 వరకు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తామని ప్రకటన చేస్తున్నా.. ఎంత వరకు పాటిస్తారోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. గతంలోనూ ఎన్నోసార్లు ప్లాస్టిక్‌ను నిషేధించినా యథావిధంగానే కొనసాగింది. ఈసారి పాలకవర్గంలో కొంత మార్పులు, చేర్పులు జరిగాయని ప్లాస్టిక్ నిషేధంపై ఎంత మాత్రం చిత్తశుద్ధి ప్రదర్శిస్తారని పట్టణంలో చర్చ జరుగుతోంది.

కోడి పందెల స్థావరంపై దాడి

ఆత్మకూర్: కోడి పందెల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం మండలంలోని ఆరేపల్లిలో కోడి పందెలు ఆడుతున్నట్లు సమాచారం రాగా 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మహేష్‌గౌడ్ తెలిపారు. రూ.20,940 నగదు, 13 ఫోన్లు, బైకు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. 10 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటన పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రేమిస్తున్నానంటూ వేధింపులు

- పురుగు మందు తాగి బాలిక ఆత్మహత్య

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చింతలపల్లిలో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ బాలవెంకటరమణ తెలిపిన వివరాలు ఇలా.. చింతలపల్లికి చెందిన దివ్య (17) కొల్లాపూర్ పట్టణంలోని కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. అదే గ్రామానికి చెందిన దినేష్ దివ్యను ప్రేమిస్తున్నానని వేధిస్తున్నట్లు తెలిపారు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పగా దినేష్‌ను వారు మందలించారు. దినేష్ కోపంతో అమ్మాయికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోకపోతే చంపేస్తానని బెదిరించడంతో బాలిక శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. దీంతో చికిత్స కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ తరలిస్తుండగా శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు చేయగా దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేప పూత యూరియా ప్రయోజనాలు


పొలంలో యూరియా వేస్తున్న రైతు

అలంపూర్: పంటల సాగులో యూరియా వాడకం తప్పనిది. ప్రస్తుతం మార్కెట్‌లో రెండు రకాలుగా లభ్యమవుతుంది. ఒకటి సాధారణ యూరియా కాగా మరొకటి వేప పూత యూరియా. వేప పూత యూరియానే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం గతంలో సూచనలు చేసింది. ప్రభుత్వ సూచనల మేరకు వేప పూత యూరియాని వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీని వల్ల కలిగే బహుళ ప్రయోజనాల గురించి వ్యవసాయ అధికారులు పలు సలహాలు అందజేస్తున్నారు.

వేప ప్రయోజనం

తరతరాల నుంచి వేప లాభాలు పదిలం. వేప గింజలు, ఆకులు, నునె, బెరడు వేర్లు అన్ని రైతు నేస్తాలే. ఇలాంటి లక్షణాలతో వేప వృక్షం క్రిమి సంహారిణిగా మారింది. దీనికి తోడు వేప గింజల్లో నూనె శాతం అధికంగా ఉండటం వలన వేప విలువ మరింత పెరిగింది.

యూరియా ప్రయోజనం

పంటకు నత్రజని పోషకాన్ని 80 శాతం యూరియా రూపంలో అందిస్తారు. యూరియాలో నత్రజనితోపాటు 20 శాతం కర్బనం, 26 శాతం ఆక్సిజన్, 6 శాతం హైడ్రోజన్ మూలకాలు ఉన్నాయి. నత్రజని మూలకాన్ని పంటలు సద్వినియోగం చేసుకోకపోతే వృథాగా భూమిలోకి పోతుంది.

వేప పూత ఉపయోగం

వేప పూత యూరియాలో రెండు అంశాలు ఉన్నాయి. గాలి సహజ వాయువుల ద్వారా యూరియా తయారీ మొదటి అంశం. ఈ విధంగా తయారైన సన్న యూరియాపై వేప నూనె పూతల పట్టించడం.

పని చేసే విధానం

సాధారణంగా యూరియా ఎరువులో నత్రజని అమ్మోనియం రూపంలో ఉంటుంది. యూరియా పొలాలకు వేసినప్పుడు భూమిలో ఉండే నైట్రిఫయింగ్ బ్యాక్టీరియా అమ్మోనియం రూపంలో ఉండే నత్రజనిని నైట్రేట్ రూపంలోకి మార్చి మొక్క వేరుకు అందకుండా భూమి పొరల్లోకి వెళ్తుంది. యూరియా వృథా అవుతుంది. అయితే వేప పూత యూరియా వల్ల ఈ బ్యాక్టీరియా చనిపోయి వృథాను అరికడుతుంది.

లాభాలు

సాధరణంగా సన్న యూరియా తేమను గ్రహించి బస్తాలలో కొంత మేర కరగడం, గడ్డలు కడుతాయి. వేప పూత యూరియాలో వేప నూనె యూరియా మీద పొరగా ఉండటంతో తేమను త్వరగా గ్రహించదు. సాధారణ యూరియా నీటిలో త్వరగా సులువుగా కరుగుతుంది. భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు పంటకు అందించే అధిక భాగం మొక్కలకు అందకుండా భూమి లోపలి పొరల్లోకి చేరుతుంది. అయితే వేప పూత యూరియాతో ఈ సమస్యలుండవు. యూరియా ఎరువును సూర్యరశ్మి, గాలి తగిలితే ఎరువు ఆవిరి అవుతుంది. వేప పూత యూరియాలో ఈ సమస్య ఉండదు.

ఎలా వాడాలి

పంట అవరాలు అనుగుణంగా రెండు సార్లు వేప పూత యూరియా వేయాలి. భూమిలో సరైన తేమ ఉన్నప్పుడే దీన్ని ఉపయోగించాలి. వరి లాంటి పొలాల్లో నీటిని ముందు తీసివేసి వాడాలి. మరుసటి రోజు నీరు పెట్టాలి. తేలిక నేలల్లో తేలికపాటి తడి ఇచ్చి వేప పూత యూరియా వేయాలి. బరువు నేలల్లో తడి ఇచ్చే ముందు ఎరువు వేస్తే సరిపోతుంది.


సాగు చేసిన వరి పంట